విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 23, సెప్టెంబర్ 2025

ఆశావర్కర్‌ల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర - డోన్ : ఆశా వర్కర్ల కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.అన్వర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఉమా, హుస్సేన్ బి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డోన్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎస్ అన్వర్ అధ్యక్షతన పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సుంకయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్స్ అనేక సంవత్సరాల నుండి పనిచేస్తూ... అతి తక్కువ గౌరవేతనంతో కష్టపడి 24 గంటలు ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా..., ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి వారికి సేవలు అందించడంలో ముందు ఉన్నారన్నారు. ప్రభుత్వానికి కూడా మంచి పేరు తెచ్చారని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తెచ్చారన్నారు. ఆ రోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకులు కితాబు ఇచ్చి, సన్మానించారన్నారు. కానీ వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, పని భారం రోజురోజుకీ విపరీతంగా పెంచారని వారన్నారు. ప్రస్తుతం కార్మిక చట్టాలను సవరించి 8 గంటల పని విధానం తుంగలో తొక్కి 10 గంటలకు పెంచారన్నారు. పని గంటలు పెంచినప్పుడు వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. అనేక యాప్స్ ద్వారా పనిచేయని, సెల్లు ద్వారా ఎలా ఆన్లైన్ చేయలేక పోతున్నారన్నారు. ఎన్ సిడిసిడి సర్వేలు ఆశా వర్కర్స్‌కు సంబంధం లేని పనిని ఎలా చేయిస్తున్నారని, అలాగే జబ్బులు ఉన్న టీబి ఇతర అనారోగ్యంతో ఉన్న వారితో గల్లా ఇంటి దగ్గర నుండి తీసుకొని రావాలని ఎలా ఆదేశిస్తారన్నారు. వ్యాక్సిన్ దూరానికి ఎలా తీసుకొని రమ్మని ఆదేశిస్తారన్నారు. ప్రభుత్వ ఆశా వర్కర్స్ పని చార్టులో ఇవన్నీ ఉన్నాయా..., లేకపోతే ఎందుకు ఆశ వర్కర్లను బెదిరించి వేధించి ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయిస్తారా అని మండిపడ్డారు. ఈ సమస్యలను ఆరోగ్య శాఖ మంత్రికి,,హెల్త్ కమిషనర్ కు జిల్లా కలెక్టర్కు త్వరలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు..ఆశా వర్కర్స్ ను బెదిరిస్తే బానిసలు లాగా చూస్తే తగిన గుణపాఠం ఏఐటీయుసి ఎర్రజెండా ద్వారా తమ హక్కుల సాధన కోసం తిరుగుబాటు పోరాటం మొదలవుతుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్ల తో కూడిన వినతిపత్రం తహశీల్దార్ రవికుమార్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుశీలమ్మ, కవిత, ఫాతిమా అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రైతు కుటుంబం పెట్రోల్ పోసుకుని అత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేసిన సంఘటన సోమవారం నంద్యాల కలెక్టర్ అఫీసు నందు చోటుచేసుకుంది. తమ పొలంలో బేతంచెర్ల తహశీల్దారు బలవంతంగా రోడ్డు వేయించాడని రైతు ఆరోపించారు. రైతు కుటుంబానికి న్యాయం చేస్తామని కలెక్టర్ రాజకుమారి హామీ ఇచ్చారు. ఆత్మహత్యాయతన్ని త్రీ టౌన్ సీఐ కంబగిరి రాముడు అడ్డుకున్నాడు. అత్మహత్యయత్నంకు పాల్పడిన కుటుంబంతో కలెక్టర్ రాజకుమారి కలిసి భోజనం చేసి, బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

గొడిగనూరులో విషజ్వరాల విజృంభణ

▶▶బీసీ కాలనీలో 20 మందికి విషజ్వరాలు

▶▶పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొడిగనూరు గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక బీసీ కాలనీలో పారిశుధ్యం లోపించి ప్రజల పాలిట శాపంలా మారింది. గ్రామంలోని బీసీ కాలనీలో వర్షపునీరు, మురికి నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. బీసీ కాలనీలో చిన్నవెంకట సుబ్బయ్య, నాగనరసింహుడు, గౌస్‌భీలతో పాటు మరో 20మంది విషజ్వరాల బారినపడ్డారు. స్థానిక కాలనీలో పారిశుధ్యం పరిశీలి స్తే అత్యంత దారుణంగా ఉందని ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులకు కొద్దిమేర కూడా శ్రద్ధలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీలో దాదాపు 20మంది విషజ్వరాల బారినపడి మంచం పట్టారు. అధికారులు స్పందించి బీసీ కాలనీ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కాలనీ ప్రజలు వాపోయారు. పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జ్వరంతో బాధ పడుతున్న చిన్న వెంకటసుబ్బయ్య

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-బేతంచెర్ల : రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర సమితి సభ్యులు కోట్ల మహాలక్ష్మి, ఏఐటియుసి నాయకులు దస్తగిరి, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నందు ఎంపీడీవో ఫజల్ రెహమాన్, డిప్యూటీ తహసీల్దారు మారుతి, మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్‌లకు ఆశా వర్కర్ల డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ ఆశా వర్కర్లు ఆర్.వెంకటలక్ష్మి, కె.రమాదేవి, నాగేంద్రమ్మ, రమాదేవి,పుష్పవతి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ప్యాపిలి : కూటమి ప్రభుత్వం తక్షణమే ఆశా వర్కర్ల కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి గార్లదిన్నె మహేష్, పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మండల పరిధిలోని ఆశా వర్కర్లు ర్యాలీతో ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచాలని అనే నినాదాలతో తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులు అరుణ, సుధాలక్ష్మి, వారు మాట్లాడారు... అనంతరం ఈ సమస్యలన్నిటిపై తాసిల్దార్ భారతికి వినతిపత్రాన్ని అందజేశారు. లక్ష్మీదేవి,సుధా,సుగుణమ్మలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించండి

విశాలాంధ్ర-డోన్ : గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి నిర్మాణాలని తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ డోన్ పట్టణ కార్యదర్శి మోట రాముడు, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్.కె రామమోహన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, సీనియర్ నాయకులు పి.వెంకటేశు అన్నారు. సోమవారం డోన్ ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఇంటి నిర్మాణానికి..., ఐదు లక్షల ఇవ్వాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం 18,0000 ఇస్తుందని, అది ఏ మాత్రం సరిపోదు అంటూ మా ప్రభుత్వ అధికారులకు వస్తే ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు...అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిపోయిన ఇంతవరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల నిర్మాణాలను కూడా ఇంతవరకు పూర్తి చేయలే దని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి 1,80,000 ఇంటి నిర్మాణం కోసం బిల్లు శాంక్షన్ చేశారని, డోన్ పట్టణంలో దొరపల్లె దగ్గర, ఉడుములపాడు గ్రామం దగ్గర దాదాపు 100ఎకరాల్లో మొత్తం రూ. 10 కోట్ల ఖర్చు చేసి జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి చేసినారని, దాదాపు 4,000 మంది లబ్ధిదారులు లక్షల రూపాయలు వేచించి ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. 2024 ఎలక్షన్లలో వైసీపీ ప్రభుత్వం పోయి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలను పాలకులు గాని అధికారులు గానీ పట్టించుకోవట్లేదని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించట్లేదన్నారు.దానివల్ల ప్రజలు ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ఆ కాలనీలలో మౌలిక కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలంలో ప్రారంభమైన దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో దసరా మహోత్సవాలు నేటి నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు ఉత్సవాల నిర్వహణలో భాగంగా కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివా సరావు దంపతులు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు స్థానాచా ర్యులు అర్చక స్వాములు వేద పండితులు సోమవారం ఉదయం అమ్మవారి యాగశాల లో యాగశాల ప్రవేశం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉత్సవ సంకల్పం గణపతి పూజ కంకణ పూజ-కంకణ దారణ స్వామి వారి యాగశాల లో రుద్ర హెూమం చండీ హెూమము కుమారి పూజలు జపపారాయణలు సాంప్రదా యవద్ధంగా శాస్త్రుక్తకంగా అర్చక స్వాములు నిర్వహిస్తున్నారు దసరా ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి యాగశాలలో అఖండ దీప స్థాపన వాస్తు పూజ మండపారాధనలు చండీ కలశ స్థాపన శ్రీ చక్రార్చన నవగ్రహ జపాలు చతుర్వేద పారాయణాలు చండీ సప్త శతి మహావిద్య పారాయణలు సూర్య నమస్కారాలు స్వామివారి యాగశాలలో గణపతి పూజ శివ సంకల్పం అఖండ దీప స్థాపన వాస్తు పూజ మండపారాధనలు రుద్ర కలశ స్థాపన మొదలగు కార్యక్రమాలను అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి దంప తులు ఆలయ అర్చక వేద పండితులు పాల్గొన్నారు.

కంపుకొడుతోంది.. కాపాడండి మహాప్రభో

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని కూలూరు రస్తా కాలనీలో మురికి కాలువలో నీరు నిలిచి, చెత్త వ్యర్థ పదార్థాలతో కంపుకోడుతోందని - కాపాడండి మహాప్రభో అంటూ మహిళలు సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కాలనీవాసులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టితో ఏర్పాటు చేసిన మురికి కాలువలలో వ్యర్థాలు నిలిచి దుర్గందంగా మారిందని వాపోయారు. మురుగు నిల్వ ఉండటంతో పందుల సంచారంతో పాటు దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు సమస్యపై సంబంధిత అధికారులకు గతంలో వినతి పత్రంతో పిర్యాదు చేసిన ఫలితం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మురికి నీరు నిలుచకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. అనంతరం ఈఓ తారకేశ్వరికి వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రతిపాదనలు సమర్పించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాలు, రోడ్లు, భవనాల నిర్మాణం వంటి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో అర్జీల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి ప్రతి ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరమవుతుందో సంబంధిత శాఖలు స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూముల వివరాలను సిద్ధం చేయడంలో ఆలస్యం జరిగితే సంబంధిత శాఖలపై బాధ్యత ఉంటుందన్నరు. భూసేకరణకు సంబంధించి పబ్లిక్ హెల్త్ శాఖకు ఆళ్లగడ్డ, నందికొట్కూర్లలో ఎస్టీపిసి ప్రాజెక్టు యుఐడిఎఫ్ స్కీం కింద రెండెకరాలు, గృహ నిర్మాణాలకు పట్టణ ప్రాంతాలలో వంద ఎకరాలు, బనగానపల్లెలో ఎంజెపి స్కూల్, ఆళ్లగడ్డ పట్టణంలో బాలుర వసతి గృహానికి 50 సెంట్లు, బాలికల వసతి గృహానికి 50 సెంట్లు, నంద్యాల పట్టణంలోని బీసీ భవన్‌కు 50 సెంట్లు, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, శ్రీశైలంలోని ఆరు సంక్షేమ వసతి గృహాలకు ఒక్కొక్కటికి 50సెంట్లు చొప్పున, ఖజానా శాఖకు ఆర్థిక సమీకృత భవనానికి 50 సెంట్లు, అవుట్డోర్ స్టేడియానికి 15ఎకరాలు, నియోజకవర్గాలలో పశువుల వసతి గృహాలకు అవసరమైన భూములు, ఆళ్లగడ్డలో వంద పడకల ఆసుపత్రికి రెండు ఎకరాలు, డోన్‌లో వంద పడకల ఆసుపత్రికి మరో రెండు ఎకరాలు, పిన్నాపురం, యు.బల్లవరం, బిల్లేలాపురం, కానాల స్కూళ్లకు ఒక్కో స్కూలుకు 5ఎకరాలు చొప్పున, రెసిడెన్షియల్ హాస్టళ్లకు అల్లూరులో పది ఎకరాలు అవసరమని సంబంధిత శాఖలు సూచించిన నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో కలసి భోజనం

జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో పాల్గొన్న అర్జీదారులతో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి కలిసి భోజనం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల కోసం శ్రీ కాశిరెడ్డి నాయన సత్రం, ఓంకారం వారి ఆధ్వర్యంలో అందజేసే ఉచిత భోజన కార్యక్రమంలో అర్జీదారులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అర్జీదారులతో భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా విని స్పందించిన కలెక్టర్, అధికార యంత్రాంగం, ప్రజల మధ్య దూరాన్ని తగ్గించడం ద్వారా సేవా దృక్పథం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని ఆమె తెలిపారు. అర్జీదారులతో కలసి భోజనం చేయడం ద్వారా అధికార యంత్రాంగం ప్రజల మధ్య దూరాన్ని తగ్గించడం లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రజలతో భోజనం పంచుకోవడం ద్వారా వారి మనసులోని మాటలు నేరుగా వినే అవకాశం కలుగుతుంది. ఇది ప్రజా సేవలో పారదర్శకతను మరింత బలపరుస్తుందని కలెక్టర్ అన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి : తహసీల్దార్

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను (అర్జీలు) రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మండల తాహసిల్దార్ నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం నాడు స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు రైతులు నుంచి వచ్చిన అర్జీలను తాహసిల్దార్ నారాయణరెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, మండల విద్యాధికారి స్వరూప1,ఏపీఓ ప్రతాప్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో రెండు డీఏలను దసరాలోపు ప్రకటించాలని ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.ఎం.షరీఫ్, అధికార ప్రతి నిధి వీరబ్రహ్మం ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలవేళ పీఆర్సీ,ఇస్తామని సకాలంలో డీఏలు ఇస్తామని హామీలి చ్చిన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైన రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన డీఏలను కూడా ఇవ్వడం లేదని, సరెండర్ లీవు బిల్లులు, గ్రాట్యుటీ చెల్లించడం లేదని దీంతో ఉద్యోగులలో తీవ్ర ఆందోళన నెలకొన్నదని వారు తెలిపారు. డీఏ ప్రకటించి,పీఆర్సీ కమీషన్‌ను నియమించాలని కోరారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన మొట్టె రంగస్వామి (48) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ రమేష్ బాబు సోమవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు రంగస్వామి మద్యానికి బానిసై ఏ పని చేయడం చేతకాక ఆర్థికంగా ఇబ్బంది పడేవాడన్నారు. మద్యం కోసం ఇంట్లోని ధాన్యాన్ని అమ్ముకొని తాగుతుంటే చెడ్డపేరు వస్తుందని కుటుంబ చెప్పగా, దీంతో రంగస్వామి తనకు ఏ పని చేయడం చేతకాదని మనస్థాపం చెంది సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి పక్కన ఉన్న చెట్టుకు పంచతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని మృతిని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం : తిరుపతి

విశాలాంధ్ర - మిడుతూరు: మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థనారి స్వశక్తపరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి అన్నారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం,గర్భాశయ, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, వయోవృద్ధులకు వైద్య పరీక్షలు, మానసిక పరీక్షలు , కిషోర్ బాలికల పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఎంపీడీవో దశరథ రామయ్య, జనరల్ మెడిసిన్ డాక్టర్ భరత్, డాక్టర్ శారద, జనరల్ సర్జన్ డాక్టర్ అశ్విన్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, మానసిక వైద్యులు శరత్చంద్ర, దంత వైద్యులు డాక్టర్ వీణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే గుణపాఠం చెపుతాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి గుణపాఠం చెపుతామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. సోమవారం నంద్యాల విద్యుత్ శాఖ కార్యాలయం నుండి జిల్లా జెఎసి ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు ర్యాలీగా బయలుదేరి సాయిబాబానగర్ సర్కిల్లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం అక్కడినుండి శాంతియుత ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకొని తమ డిమాండ్ల సాధనకు ఆందోళన నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ మోసం చేస్తుందని గళమెత్తారు. ఏపీ జేఏసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ ఎంఎల్ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపకపోతే ఊరుకునే ప్రసక్తి లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ ర్యాలీలో నంద్యాల జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.ధర్నాలో ఉమ్మడి కర్నూలు జిల్లా జేఏసీ కన్వీనర్ ఎస్ లక్ష్మీకాంత్ రెడ్డి,నంద్యాల డివిజనల్ చైర్మన్ వి.కృపాకరం, డివిజన్ కన్వీనర్ నారాయణరెడ్డి, ఎఇరామయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉద్ధృతంగా.. వక్కిలేరు

కాచింతల క్షేత్రం వద్ద ఆలయం వద్దకు చేరుకున్న నీరు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో ఉన్న వకులా నది (వక్కిలేరు) కి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వకులా నదికి నీరు వచ్చి చేరుతోంది. చెరువులు, కాలువల నుంచి వర్షపు నీరు నదిలోకి చేరుతుంది. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో ఉన్న కాచింతల కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలోకి వరద నీరు వచ్చి చేరింది. వకులా నది ఒడ్డుననే ఆలయం ఉండడంతో వక్కిలేరుకు వరద నీరు వచ్చినప్పుడల్లా ఆలయంలోకి వరద నీరు వెళుతున్నాయి.

నరేంద్ర మోడీ రాజీనామా చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : దొంగ ఓట్లతో గద్దెనిక్కినటువంటి దేశ ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి దిగిపోవాలని మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు షాజహాన్ బేగం అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో ఓట్ చోర్ - గద్దే చోడ్ ,ఓటు దొంగ-గద్దె దిగు అనే నిరసన కార్యక్రమం నిర్వహించారు ముందుగా పట్టణంలోని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ దొంగ ఓట్లతో గెలుపొందారని, రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకన్న గౌడ్, శ్రీరాములు, ఇంతియాజ్,మనోహర్,మౌలాలి,ముర్తుజావలి,రజిత,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల వారు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భూమా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 16నెలలుగా ఆరు విడతల ట్యూషన్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు, ప్రస్తుతం ఏడవ విడత నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్యూషన్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు నిర్వహించలేక అనేక సంక్షోభాలకు గురవుతున్నామన్నారు. ట్యూషన్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.

రుద్రవరం తహసీల్దార్‌గా ఆల్ఫ్రెడ్

విశాలాంధ్ర - రుద్రవరం : మండల నూతన తహసిల్దారుగా ఆల్ఫ్రెడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ మండల తహసీల్దా రుగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున రావు గత నెల పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖరయ్య తాసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆల్ఫ్రెడ్‌ను రుద్రవరం తహసిల్దార్ గా పూర్తి బాధ్యతను అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. పరిష్కారం కానీ సమస్యలు ఏమైనా ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు : ఎంపీడీవో మధుసూదన రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో మురారిలు సోమవారం రేగడ గూడూరు గ్రామం, వేల్పనూరు గ్రామం సందర్శించారు. సిబ్బందికి పరిశుభ్రత, చెత్త సేకరణపై పలు సూచనలు ఇస్తూ అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వేల్పనూరు సచివాలయం సందర్శించి, సిబ్బంది హాజరును పరిశీంచారు. సర్వేలను పూర్తి చేయాలని, వాహన మిత్ర మిగిలిన డేటాను పూర్తి చేయాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

విశాలాంధ్ర - రుద్రవరం : మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా నియమ నిబంధనలో పాటిస్తూ వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని అన్నారు. మద్యం సేవిస్తూ వాహనాలు నడుపుతున్న లింగం దిన్నె గ్రామానికి చెందిన నాగ శేషు, నాగులవరం గ్రామానికి చెందిన మునిస్వామిలపై కేసు నమోదు చేసి ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి పదివేల చొప్పున జరిమానాలు విధించడం జరిగిందని ఆయన తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొడెగనూరు మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు దేశంరెడ్డి(71) అనారోగ్యంతో హైదరాబాదులో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మండల ప్రజలు, టిడిపి నాయకులు, గొడెగనూరు గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా 2013 సంవత్సరం నుంచి 2018సంవత్సరం వరకు పని చేసి ప్రజల మన్ననలను పొందారు. ఆయన మృతిపట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు. మాజీ సర్పంచ్‌కు భార్య, ఒక కుమారుడు,ఇద్దరుకుమార్తెలు సంతానం కలరు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 23, సెప్టెంబర్ 2025

లేబర్ కోడ్‌లు, 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: లేబర్ కోడ్‌లు, 13 గంటల పని విధానాలను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర కార్మిక సంఘాల జాతీయ సమితి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.విజయ అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజి బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్ హాజరై ప్రసంగిస్తూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకి పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, 13 గంటల పనివిధానం అమలు చేయాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రయత్నం చేస్తున్నాడని త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులను వేల మందిని తొలగిస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేస్తానని, హమాలీలకు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ జరగలేదన్నారు. వేలాదిమంది మృతి చెందిన కార్మికుల డబ్బులు చెల్లించబడలేదని, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. లైసెన్సు ఉన్న ప్రతి ఆటో కార్మికునికి ఎలాంటి షరతులు లేకుండా వాహన మిత్ర కింద రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర నాయకులు టి రామాంజనేయులు ఎ.ఈశ్వర్ ఆర్.కృష్ణారెడ్డి, రాము, గణేష్ ఎం.నల్లన్న, పురుషోత్తం, సీఐటీయూ నాయకులు సాయి బాబా, నరసింహులు యేసు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఖరీఫ్‌లో అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంటలన్నింటికి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎ.సిరికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.జగన్నాథం, పంపన్నగౌడ్‌లు మాట్లాడుతూ 2025 ఖరీఫ్‌లో ముందుగానే వర్షాలు రావడం వల్ల రైతులు ఉల్లి, టమోటా, పత్తి, మిర్చి వరి, కంది, కొర్ర, సజ్జ, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారన్నారు. పంట చేతికి వచ్చిన సమయంలో మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక పండిన పంటలను పంట పొలాల్లో, రోడ్ల మీద, ఉల్లి టమోటాను పొలాల్లోనే వదిలిఎస్తున్నారన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని 15 మండలాల్లో పంటల పరిశీలన కార్యక్రమం చేపట్టామన్నారు. పెట్టుబడి ఎక్కువగా పెట్టారని, ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్‌లో వేసుకున్న పంటలు పత్తి, కంది, ఆముదం, సజ్జ, కొర్ర, రాగి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టపరిహారం కింద ఎకరాకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్, రైతు సంఘం నాయకులు పెద్దటేకూరు పుల్లన్న, దొడ్డిపాడు బాష, రబియా, మాధవి, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగర ప్రజలు తెలుపుతున్న సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, నిర్దేశిత గడువులోపు అర్జీలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి తొలిసారి 54 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల రోగులు జాగ్రత్తగా ఉండాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో స్వస్తిక్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సచివాలయం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా ఆరోగ్య పరిరక్షణ, కుటుంబాలను బలపరచు కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గజేంద్ర రెడ్డి, సామాజిక ఆరోగ్య కార్యకర్త కవిత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరత తీవ్రతరం

విశాలాంధ్ర - ఆలూరు: మండలంలో యూరియా ఎరువు కొరత తీవ్రంగా ఉందని, తక్షణమే రైతులకు అవసరమైన పరిమాణంలో యూరియాను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి చాపల గోపాల్, ఏఐటీయూసీ తాలూకా ఉపాధ్యక్షుడు శివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు సబ్సిడీ ధరలకే అందించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత కారణంగా సాగు పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. రైతులు మార్కెట్లలో ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడు తున్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని రైతుల అవసరాలను తీర్చాలన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన శనిగ విత్తనాలు సబ్సిడీ కింద అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. సిద్ధప్ప, లింగన్న, వెంకటేష్, ఉపేంద్ర, బాష, పాల్గొన్నారు.

విద్యుధాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్రు-హొళగుంద: లింగదహళ్లి గ్రామంలో సోమవారం ఎం.మారన్న (39) విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సత్యమ్మ తెలిపిన ప్రకారం తన భర్త మృతుడు మారన్నకు అదే గ్రామానికి చెందిన ఈడిగ ఈరన్న పని ఉందంటూ ఫోన్ చేశాడన్నారు. ఈరన్న ట్రాక్టర్లో పత్తి సంచులు ఎత్తమని మృతుడిని పిలువగా ప్రతి సంచులను ఎత్తుతుండగా తలపై ఉన్న విద్యుత్ తీగలు తాకి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడన్నారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో తమనెవరు చూసుకుంటారంటూ భార్య పిల్లలు బోరున ఏడ్చారు. భార్య సత్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ లక్ష్మీ రామ్ నారాయణ నాయక్ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగిచారు.

ఆలూరు ఇంచార్జీగా వైకుంఠం జ్యోతి ఎంపికపట్ల టీడీపీ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర - ఆస్పరి : ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీగా వైకుంఠం జ్యోతిని నియమించడంపై మండల టీడీపీ నాయకులు వర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లేకల్లు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు బత్తిన జీవన్ కుమార్, జనసేన మండల కన్వీనర్ అరవింద్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీని నమ్ముకున్న కుటుంబానికి న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు రఘు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫోటో వీరేష్ యాగంటి కృష్ణ, నాయకులు రవి, వెంకటేష్, పోలీస్ హంపయ్యలు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగింపు

విశాలాంధ్ర - హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ పక్కనే పడేసిన చెత్త కుప్పలను ఎంపీడీవో విజయ లలిత, సర్పంచ్ రంగమ్మ ఆదేశాలతో గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ జేసీబీ యంత్రం ద్వారా చెత్త కుప్పం ఎత్తి ట్రాక్టర్లలో వేయడంతో డబ్ల్యూటీసీ సెంటర్లకు చెత్త కుప్పలను తరలించారు. ఎన్నో నెలల నుండి చెత్త కుప్పలు అధికారులు తొలగించక వదిలేశారు. దీంతో విద్యార్థులు, భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చెత్త కుప్పలను తొలగించేది ఎవరు అంటూ విశాలాంధ్ర పత్రికలో శీర్షిక వెలువడడంతో గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ చెత్తకుప్పలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేసి, పరిశుభ్రంగా ఉంచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినందుకు ప్రజలు అధికారులకు, విశాలాంధ్రపత్రికకు అభినందించారు. ఎంపీడీవో విజయ లలిత మాట్లాడుతూ గ్రామ సుందరీకరణకు ప్రజలు అందరూ సహకరించాలని, తడి చెత్త, పొడి చెత్తను ఇంటి బయట పార వేయకుండా ఇంటి వద్దకు వచ్చే పంచాయతీ వాహనాల్లో వేస్తే దూరంగా తీసుకువెళ్లి డబ్ల్యూసిటీ సెంటర్లో వేస్తారని తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్, మండల కార్యదర్శి యు.కారుమంచి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, రవిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి నాలుగు స్తంభాల మండపం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 13 గంటల పని భారం విధానాన్ని రద్దు చేయాలని, కార్మిక హక్కులను కాలరాసే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు మాదన్న, రాజప్ప, ఉపేంద్ర, సీఐటీయూ నాయకులు కాశీ, మధు, రమేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కోడుమూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు చిన్నరాముడు, సీపీఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేషుకుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక కోట్ల సర్కిల్ వద్ద ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆటో యూనియన్ నాయకులు మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్నరాముడు, సీపీఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేషుకుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు మాధవస్వామి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గఫుర్ మియ్యా, సీఐటీయూ నాయకులు ఈరన్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాల రాసేందుకు తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లన్నీ దేశంలోని కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టు లాంటివని, కార్మికుల లేబర్ కోడ్‌లు రద్దయేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారన్నారు. కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దొడ్డిదారిలో లేబర్ కోడ్‌లు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు గద్దం నాగరాజు, మద్దిలేటి, హమాలీ సంఘం నాయకులు శంకర్, దాము, మణి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇంచార్జీగా వైకుంఠం జ్యోతి నియామకం

విశాలాంధ్ర -ఆలూరు: నియోజకవర్గ ఇంచార్జీ వైకుంఠం జ్యోతిని నియమిస్తూ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నియోజకవర్గ ఇంఆచార్జీ వైకుంఠం జ్యోతి స్వాగతించారు. ఈ పదవిని తనకు కేటాయించినందుకు చంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యతకు ఎంపిక చేయడం ఘనతగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. పార్టీకి నిబద్ధతతో సేవ చేస్తానని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా వ్యవహరిస్తానని వైకుంఠం జ్యోతి వెల్లడించారు.

పంటను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర - మంత్రాలయం: ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, తాలుకా అధ్యక్షులు ఎం.గోపాల్, రైతు సంఘం మండల అధ్యక్షుతు తాయన్నలు కోరారు. సోమవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో కోసిగి మండలంలో చెందిన బోయ వీరేష్ రైతు పొలంలో వెళ్లి ఉల్లి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, తాలూకా అధ్యక్షులు ఎం.గోపాల్, రైతు సంఘం మండల అధ్యక్షులు పి.తాయన్న మాట్లాడుతూ కోసిగి మండలంలో రైతులు దాదాపు 50శాతం ఉల్లి పంటను రైతులు సాగు చేసుకోవడం జరిగింది. కానీ ఉల్లి పంట కర్నూలు మార్కెట్‌కు రాగానే గిట్టుబాటు ధర లేక చాలా తక్కువ ధరలకు విక్రయించి నష్టపోయారన్నారు. డీహెచ్‌పీఎస్ ఓంకార స్వామి, ఏఐటీయూసీ మండల నాయకులు బి.పరుశురాం, రాజసింగం మండల నాయకులు నర్సింలు, చార్లెస్, రైతులు వీరేష్ వీరన్న, గుండప్ప వీరితోపాటు మహిళ కూలీలుపాల్గొన్నారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

విశాలాంధ్ర - కోడుమూరు : ఉల్లి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని, ఉల్లి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో పర్యటించిన ఆయన కోడుమూరు వైసీపీ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైసీపీ ఇంచార్జీ ఆదిమూలపు సతీష్‌లతో కలిసి రైతుల ఉల్లి పంట పొలాలను పరిశీలించారు. ఉల్లి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లి రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉల్లి రైతులకు ఒక హెక్టారుకు కనీసం రూ.లక్ష ఖర్చు అవుతుందని, కానీ మార్కెట్‌లో ఉల్లి ధర పూర్తిగా పడిపోవడంతో రైతులను పూర్తిగా నష్టాల్లో ముంచెత్తే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, రైతులు మధుసూదన రెడ్డి, గిరిబాబు, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: అధిక పెట్టుబడులతో పాటు కష్టనష్టాలను జయిస్తూ సాగు చేసి వచ్చిన పంట దిగుబడులకు కనీస మద్దతుదరా కల్పించక పోవడం సిగ్గుచేటని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య విమర్శించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సూపర్డెంట్ వసుంధరకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ ఆదోని మండల కార్యదర్శి కల్లుబావిరాజు, రైతు సంఘం ఆదోని డివిజన్ కార్యదర్శి మాదిరి ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం ఆదోని మండలం అధ్యక్షులు కొత్తూరు గంగన్న, మండిగిరి సీపీఐ నాయకులు శేషప్ప మాట్లాడారు.

నానో యూరియా, డీఏపీల వాడకంపై అవగాహన

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న అన్ని గ్రామాల ఎరువు, పురుగు మందుల దుకాణదారులు నానో యూరియా, నానో డీఏపీల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో పురుగు, ఎరువుల దుకాణాల యజమానులతో వ్యవసాయ అధికారి సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తప్పనిసరిగా అందరూ నానో యూరియా, నానో డిఏపి వాడకాన్ని రైతులకు అవగాహన కల్పిస్తూ రైతులకు తెలియజేయాలని తెలిపారు. డీలర్లకు వ్యవసాయ అధికారి సలహాలు సూచనలు ఇచ్చారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని ఆయన తెలియజేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని అదేవిధంగా రైతులకు తీసుకున్న వాటికి బిల్లు రసీదు తప్పకుండా ఇవ్వాలని అన్నారు.

టీడీపీ ఇంచార్జీ ఎన్నిక పట్ల సంబరాలు

విశాలాంధ్ర - హొళగుంద: ఆలూరు నియోజకవర్గం నూతన టీడీపీ ఇంచార్జీ పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల సోమవారం మండలంలో ఆ పార్టీ నాయకులు బాణ సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నూతన ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో నియోజకవర్గతో పాటు మండల అభివృద్ధి సాధ్యమని వైకుంఠం యూత్ నాయకులు ల్యాబ్ గిరి అన్నారు. మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, నాయకులు దుర్గప్ప, వలి, బకాడి వీరేష్, అయ్యప్ప, ఆదం, హెచ్‌జే పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. లింగదహళ్లి, గజ్జెహళ్లి, తదితర గ్రామాల్లో ఈ సందర్భంగా సంబరాలు చేసి, స్వీట్లు వంపిణీ చేశారు.

అంతర్జాతీయ సెమినార్‌లో ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వికసిత్ భారత్ ఏ2047 అండ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 సందర్భంలో నిర్వహించిన 2వ అంతరాతీయ సదస్సు ట్రాన్స్‌ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్, స్కిల్లింగ్ టువార్డ్స్ వికసిత్ భారత్ ఏ2047 అండ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ విజయవంతంగా పాల్గొన్నారు. ఈ సదస్సు సెప్టెంబర్ 19న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లిలిలో, సర్వీసెస్ ఎగుమతి ప్రోత్సాహక మండలి (ఎస్ఈపీసీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు, విధాననిర్మాతలు భారత ఉన్నత విద్యా రంగం అభివృద్ధి, నైపుణ్య పెంపుదల కోసం ఆధునిక వ్యూహాలను చర్చించారు. డా.నాగస్వామి నాయక్ భాగస్వామ్యం ఆయన విద్యా ప్రావీణ్యం, ప్రగతిశీల బోధనా పద్ధతుల పట్ల అంకితభావం, విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీ భవిష్యత్తుకు సిద్ధం చేయాలనే కృతనిశ్చయాన్ని ప్రతిబింబిస్తుంది, ఈ సదస్సులో 29 దేశాల నుండి ప్రతినిధులు, 20 దేశాల నుండి రాయబారులు, నీతి ఆయోగ్ ఉన్నత కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా ప్రదీప్ కుమార్

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా: జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈగా సోమవారం ఆర్.ప్రదీప్ కుమార్ బాధ్యత స్వీకరించారు. కర్నూలు డీపీఈ విభాగం ఈఈగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. ఎస్ఈ ప్రదీప్ కుమార్‌ను ఈఈ, డీఈలు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల సహకారంతో కృషి చేస్తానని చెప్పారు.

శరన్నవరాత్రి పూజలు ప్రారంభం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి, శ్రీ కాళికాదేవి ఆలయాల్లో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరిదేవికి తోటప్పయ్య ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా కాళికాదేవి విశ్వ వాసు నామ సంవత్సరం శుక్లపక్షం పాడ్యమి రోజున విశ్వబ్రాహ్మణ దంపతులు కాలమ్మ భీమేష్ ఆచార్యులు అమ్మవారికి జలాభిషేకము, వస్త్రాభరణం, ఆకు పూజ, కుంకుమార్చన ధూప దీప నైవేద్యములు సమర్పించి మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాశ్వత వీఆర్వోని నియామించాలి : సీపీఐ

విశాలాంధ్ర - ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రెగ్యులర్ వీఆర్వో లేక ఉప్పలపాడు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, రెగ్యులర్ వీఆర్వోని నియామించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఆల్ ఇండియా యూత్ లీడర్ రాష్ట్ర కార్యదర్శి రాయసీమ రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్నలు మాట్లాడుతూ మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రెగ్యులర్ విఆర్వో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కులదీవికరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ పత్రాలు, భూ సమస్యలపై వీఆర్వోను సంప్రదించాలంటే ఎవరిని కలవాలో తెలియక ఉప్పలపాడు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న వీఆర్వో గ్రామ ప్రజలకు అందుబాటులో లేక పోవడంవల్ల గ్రామ ప్రజలు ఏదైనా భూ సమస్యల కోసం గ్రామ సచివాలయం మండల తహసీల్దార్ ఆఫీస్ దగ్గర కలవడానికి వచ్చినా, చరవాణి ద్వారా వీఆరోతో సంప్రదింపులు జరిపినా గ్రామ ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల ఉప్పలపాడు గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందుకు గురవుతున్నట్లు తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో భూ సమస్యలపై ఎలాంటి సమస్యలు లేకుండా రెగ్యులర్ వీఆర్వో నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదు, వకీరయ్య, వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలకలో చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక గది

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయానికి ప్రతిరోజూ తమ పనుల కోసం వచ్చే చంటి బిడ్డల తల్లులు, ఎక్కువసేపు క్యూలైన్‌లలో వేచి ఉండే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. శిశువులకు పాలు పట్టించుకునే ప్రత్యేక సదుపాయం లేకపోవడంతో ఇన్నేళ్లుగా ఇబ్బంది పడ్డారు. ఈ సమస్య నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ దృష్టికి వెళ్ళగా, వెంటనే ప్రత్యేకంగా స్తన్యపాన గది ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తల్లులకు సౌకర్యవంతంగా ఉండేలా ఫర్నిచర్, ఫ్లోరింగ్, కర్టెన్లు, ఫ్యాన్ వంటి అన్ని అవసరమైన ఏర్పాట్లు చేసి, సోమవారం ఆ గదిని ఆయన స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శువుల ఆరోగ్యమే భవిష్యత్ సమాజానికి పునాది, తల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా, తమ బిడ్డలకు పాలు పట్టించుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి : వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఉల్లి రైతులకు కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.3 వేలు కల్పించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.20 వేలు ప్రకటించి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచేసిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేలు రైతులు పెట్టిన పెట్టుబడికి సరిపోవన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కర్నూల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, పి.నిర్మల, ఎండీ ఆనంద్ బాబు, ఎండీ అంజిబాబు, కె.వి.నారా యణ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు ఉల్లి రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటలు సాగు చేసేందుకు దాదాపుగా లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని, రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం ఏ మూలకు సరిపోదని ఆయనకు వివరించారు. ఇప్పుడు మార్కెట్‌కు తెచ్చిన ఉల్లిని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని ప్రకటించడం దుర్మార్గమన్నారు. అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదన్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి, టమోటా, పొగాకు సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల హామీలు రైతులకు అమలు చేయరా అని ప్రశ్నించారు. రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్న ప్రకటణ ఎక్కడ ఆచరణకు నోచుకోలేదన్నారు. ఉల్లిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడు హెక్టారుకు రూ.50 వేలు ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం వ్యాపారస్తులకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.3 వేలు లాగా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రైతులు పండించినటువంటి ఉల్లిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలన్నారు. రాష్ట్రంలోని కోటి మంది రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లిని అంద చేయాలని డిమాండ్ చేశారు. మేకిన్ ఇండియా పేరుతో నరేంద్ర మోడీ మోసగిస్తున్నారన్నారు. అమెరికా ఆస్ట్రేలియా నుండి పత్తి, డైరీ ఉత్పత్తులు మొక్కజొన్న ఇతర పంటలను ఎలాంటి పన్నులు లేకుండా దిగుమతి చేసుకుంటున్నారన్నారు. దేశంలో పండించిన పంట ఉత్పత్తులపై అమెరికాలో అధిక సుంకాలను విధిస్తున్న మోడీ ఏమి అనకపోవడం దుర్మార్గమన్నారు. రైతులను ఆదుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడ తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా నాయకులు గురు శేఖర్, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, నాయకులు హుస్సేన్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 23, సెప్టెంబర్ 2025

రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-అవుకు : పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం అర్చకులు దర్బాకుల రామకృష్ణ శాస్త్రి మరియు జొన్నలగడ్డ హరికుమార్‌ల అర్చకత్వమున అమ్మవారి కలశ స్థాపన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహిళలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రము మల్లెల నరసింహ ప్రతాప్ ధర్మపత్ని మురళీ కళ్యాణి ఉభయదారులుగా రాజరాజేశ్వరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అనంతరము భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లి నాగేంద్ర కుమార్, ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, తల్లము సుబ్బ నాగభూషణం, మల్లెల సూర్యనారాయణ, మల్లెల ఆంజనేయులు, బుగ్గరపు రామాంజనేయులు, గూడూరు సుదర్శన్, బుగ్గరపు పద్మనాభం, మల్లెల సునీల్ కుమార్, మారం రమణ, మల్లెల బాబి, తాలేపల్లి రాజేష్, పెండేకంటి సంతోష్ కుమార్, రావూరి రామయ్య, తల్లం సురేంద్ర, సన్నిధి శివ, రావూరి ప్రసాద్, సన్నిధి శ్రీనివాసులు, మల్లెల సతీష్ బాబు, తాలేపల్లి జనార్ధన్, వంకదార సతీష్, మేడం రవిశంకర్, మేడం సతీష్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘాల పటిష్టతకు, ఐక్యతకు ప్రత్యేక కృషి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘాల పటిష్టతకు, ఐక్యతకు శాయ శక్తుల కృషి చేస్తానని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ అన్నారు. దసరా నవరాత్రుల మొదటి రోజు సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని కాళికామాతను దర్శించుకుని కలశస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దురుగడ్డ రవీంద్రాచారి, సావిత్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో చైర్మన్ పార్వతమ్మకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె కాళికా మాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పార్వతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన గురుతర బాధ్యతలను తప్పక నెరవేరుస్తానని విశ్వబ్రాహ్మణులను అందరిని ఒక తాటిపైకి తీసుకొని వచ్చి వారి అభివృద్ధి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు చైర్మన్ శ్రీ శారద శిల్పకళా మందిరంను సందర్శించారు. అక్కడ మహిళా శిల్పి దురుగడ్డ భువనేశ్వరి శిల్పులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్వతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. శిల్ప మందిరాల్లో పని చేసే శిల్పులు పనిచేసే సమయంలో దస్టు ఊపిరితిత్తులలోకి వెళ్లి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. శిల్ప మందిరాల్లో పనిచేసే కార్మికులకు ప్రత్యేకంగా ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కళాకారులకు 50 ఏళ్ల నుండి పెన్షన్ ఇప్పించాలని భువన కోరారు. శిల్పుల తరపున భువన ఇచ్చిన అభ్యర్థనను తాను ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం తరపున సహాయ కార్యదర్శి బత్రెంకల పుల్లయ్య, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామాచారి, గోపాలచారి, రవికుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

స్వస్త్ నారీ.. స్వశక్త్ పరివార్‌లో పాల్గొన్న గురురాజ్ దేశాయ్

విశాలాంధ్ర - నందవరం: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ అరోగ్య శిభిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు, దేశాయ్ నెట్వర్క్ అదినేత గురురాజ్ దేశాయ్ పాల్గొన్నారు. సోమవారం మిట్టసోమపురం గ్రామంలో డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమం పీహెచ్‌పీనందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురురాజ్ దేశాయ్ మాట్లడుతూ మన దేశ ప్రదానమంత్రి నరేంద్ర మోదీ దేశంలొని మహిళల అరోగ్యం పట్ల ఎంతో శ్రద్దతీసుకొని, మహిళలు ఆరోగ్యాంగా ఉంటేనే ఆ కుటుంభమంతా సంతోషంగా జీవిస్తుందని, మహిళలు తమ అరోగ్యం విషయంలో డాక్టరు సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. డా.రేవతి మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్ వ్యాధులు అధికంగా ఉన్నాయని, మహిళలు శుభ్రత పాటించి చుట్టు ఉన్న పరిసరాలను కూడ శుభ్రంగా ఉంచుకుని అరోగ్యాంగా ఉండాలన్నారు. బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బీఎల్ నారాయణ, మిట్టసోమపురం నాయకులు రామలింగప్ప, పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 తగ్గింపుతో ప్రతి ఇంటికీ ఉపశమనం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 తగ్గింపు నిర్ణయం దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటికి ఉపశమనం కలిగిస్తుందని జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు అన్నారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వివేకానంద ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో అభిరుచి మధు మాట్లాడారు. పాలు, పనీర్, రొటీ, పిజ్జా బ్రెడ్, పుస్తకాలు, పెన్సిల్స్, మందులు, ట్రాక్టర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వరకు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా జీఎస్టీని తగ్గించడం ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ ఆడిటర్లు, వైద్యులు, లెక్చరర్లు, మేధావులు పాల్గొన్నారు. వ్యాపార వేత్తలు జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు.

రోడ్డు మరమ్మత్తు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు నుండి పెద్ద హెూతురు వరకు గుంతలుగా మారిన రోడ్డు మరమత్తు పనులను వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కి వెళ్తున్న సందర్భంగా గుంతలుగా మారిన రోడ్లు చూసి అక్కడే పార్టీ కార్యకర్తలతో నిరసన తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఆలూరు నుండి పెద్ద హెూతురు వరకు రోడ్ ఘోరంగా ఉందని, ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నారా లేదా అనే విధంగా రోడ్లు ఉన్నాయని అన్నారు. గుంతల లోతుగా ఉండడంవల్ల వాహనదారులు చాలామంది కిందపడి చనిపోయారని, కొంతమందికి గాయాలయ్యాయని అన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు కళ్ళు తెరిచి ఆలూరు పెద్దహెూ తురు రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి హనుమంతు, సీనియర్ నాయకులు కేపీ నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు, విటల్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై నరేంద్ర మోడీకి పాలాభిషేకం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : పట్టణంలోని స్థానిక సోమప్ప సర్కిల్లో సోమవారం నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, దేశాయ్ నెట్వర్క్ అదినేత, ఆత్మ నిర్భర్ భారత్ ప్రోగ్రావమ్ మ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జీ గురురాజు దేశాయ్, బీజేపీ జిల్లా కార్యదర్శి దయాసాగర్, పట్టణ సీనియర్ నాయకులు లలిత్ జైన్‌లు మాట్లాడుతూ దేశంలో మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లామాజీ ఉపాధ్యక్షులు బీఎల్ నారాయణ, నందవరం మండల అధ్యక్షులు మఠం రాజశేఖర్ స్వామి, టౌన్ ప్రధాన కార్యదర్శి ఉప్పర చరణ్, ఎమ్మినూరు మండల ప్రధాన కార్యదర్శి కురువ బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులుగా శరభారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల జిల్లా రెడ్ల సంఘం అధ్యక్షులుగా శవ్వా శరభారెడ్డిని నియమించినట్లు రెడ్ల కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రా రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులుగా ప్రకటిస్తూ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శరభారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి ఒక్కరు జీఎస్టీ గురించి తెలుసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ప్రతి పౌరుడు జీఎస్టీని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న నూతన జీఎస్టీ ప్రభావం భారత ఆర్థిక వ్యవసపై ఏవిధంగా ఉంటుందనే అంశముపై అధ్యాపక ఉపన్యాసమును సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అమలు కాబోతున్న నూతన జీఎస్టీ స్లాబ్‌ల గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించడం కోసం ఈ కార్యక్రమమును ఏర్పాటు చేసినందుకు కాను అర్థశాస్త్ర శాఖను అభినందిస్తూ ప్రతి విద్యార్థి తాము చదువుకునే రోజుల్లో నుంచే ప్రభుత్వం విధించే పన్నులపై అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరమన్నారు. అతిథి అధ్యాపకులుగా ఎం.సుధా కర్, విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ కడప హాజరై భారత దేశంలో జీఎస్టీకి మునుపు ఉన్న పన్నుల విధానం గురించి తెలియజేస్తూ జీఎస్టీ అమలు చేయబడిన నాటినుండి అందులో కలిగిన మార్పులను గురించి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్. ప్రసాద రెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్ సవితా దేవి, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.నాగ అరుణ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వాసవి డిగ్రీ కళాశాల యాజమాన్యం డిమాండ్ చేసారు. సోమవారం చాగలమర్రి పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రఘురామ్ ఆధ్వర్యంలో సోమవారం ఒక్క రోజు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 16నెలలు నుండి 6విడతలు ఫీజు రియంబర్స్మెంటు నిధులు, ఏడో విడత నిధులు కూడ రావాల్సి ఉందన్నారు. ట్యూషన్ ఫీజు, రిబర్స్మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి అని స్వచ్ఛందంగా బంద్ పాటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం డిగ్రీ కళాశాల సెక్రటరీ బొద్దు పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ముల్లా షాబుద్దీన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీలో సంస్కరణలు పేద, మధ్య తరగతి రైతులకు వరం

విశాలాంధ్ర - బనగానపల్లె: జీఎస్టీలో సంస్కరణలు తేవడం పేద మధ్య తరగతి రైతులకు వరం లాంటిదని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి మండల అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఇవాళ జీఎస్టీ 140 కోట్ల జనాభాకి జవాబుదారితనంగా ఉంటూ వారి కష్ట సుఖాలను అర్థం చేసుకొని ఇవాళ పెద్ద గొప్ప నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు. స్వదేశీ వస్తువులు తప్పనిసరిగా మనమందరం వాడాలని ప్రజలందరినీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బచ్చు శరత్ చంద్ర, టి.ప్రసాదం, సోషల్ మీడియా ఇన్చార్జి మేడం మనోహర్, శివ గాండ్ల లక్ష్మయ్య, సుబ్బయ్య, మల్లయ్య, సుబ్బరాయుడు, అహ్మద్ బాష, హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు ప్రారంభం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆయా గ్రామాలలో అమ్మవారు భక్తులకు బాల త్రిపుర సుందరి అలంకరణ రూపంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని లలిత సుందరేశ్వరీ దేవాలయం, గోరుమానుపల్లి పెద్దమ్మ అమ్మవారు, బందర్ల పల్లి గ్రామ సమీపంలోని శ్రీ నేలబిలం మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు, తిమ్మనాయుని పేట గ్రామంలోని అమ్మవారి దేవాలయం పరమేశ్వరి మాత అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవి అలంకరణ రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం ఆకు పూజ కుంకుమార్చన ధూప దీప నైవేద్యంలో సమర్పించారు.

నిజమైన వేతనదారులకే ఈకేవైసీ చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే నిజమైన వేతనదారులకి ఈ కేవైసీ రిజిస్ట్రేషన్ చేయాలని ఏపీడీ అల్లిపీరా అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో జరుగుతున్న ఈకేవైసీ రిజిస్ట్రేషన్‌ను ఎమ్మిగనూరు క్లస్టర్ ఏపీడీ అల్లిపీరా పరిశీలించి ఆయన మాట్లాడుతూ డబల్ జాబ్ కార్డులు, అర్హతలేని జాబు కార్డులు, ఈకేవైసీ రిజిస్ట్రేషన్ చేయకుండా, నిజమైన వేతన దారులకు మాత్రమే ఈకేవైసీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఏపీవోకు అలాగే టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేటీలకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏపీఓ రామన్న, రంగస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, సీఓఎస్‌లతో ఈపిడి సమీక్ష సమావేశం నిర్వహించి, హార్టికల్చర్, ఈకేవైసీ రిజిస్ట్రేషన్, మినీ గోకులాల గ్రౌండింగ్, కంపోస్ట్ పిట్స్, సోక్ పిట్స్, తదితర వాటిని త్వరగా పూర్తిచేసి, పెండింగ్ లేకుండా చూడాలని ఏపిడి అధికారులకు సూచించారు.

ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు: మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మహిళా సంఘం జనరల్ బాడీ సమావేశం మహిళా సంఘం సీనియర్ నాయకురాలు టి.నాగమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఏపీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలమ్మ పాల్గొని మాట్లాడుతూ మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా బి.పద్మా వతి, జి.లలితమ్మ, సహాయ కార్యదర్శులుగా జి.తిమ్మక్క, బి.రమాదేవి, ఉపాధ్య క్షులుగా ఎస్.లక్ష్మి, కమిటీ సభ్యులుగా షహరబీ, గోవిందమ్మ, సుబ్బమ్మ తదితరులు ఎన్నుకున్నారు.

ఫ్రెండ్లీ కేఫ్‌ను ప్రారంభించిన ఎన్ఎండీ ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల మున్సిపల్ ఆఫీస్ దగ్గర పద్మావతినగర్ రోడ్డులో నూతనంగా లోకేష్ కుమార్, నాగలక్ష్మి వేముల వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ కేఫ్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరికొందరికి ఉపాధి కల్పించాలని, యువత స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువత స్వయం ఉపాధికై రుణాల అందిస్తున్న విషయం గుర్తు చేశారు. అనంతరం ఫ్రెండ్లీ కేఫ్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు టిడిపి ఇంచార్జ్ నూర్ బాష, సర్దార్, మార్కెట్ డైరెక్టర్ స్వామి నాయక్, అడ్వకేట్ పిడి బాబు, మాజీ కౌన్సిలర్ కృపాకర్, నవాజ్, ఖాజా చాంద్ రెబల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం మహిళలకు ఆరోగ్య సంజీవిని లాంటిది

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం మహిళలకు ఆరోగ్య సంజీవిని లాంటిదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాలతో మహిళలకు మరింత ఆరోగ్య రక్షణ కలుగుతుందన్నారు. ఆరోగ్య శిబిరాల్లో మహిళలకు అధిక రక్త పోటు, డయాబెటీస్, క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ తో పాటు రక్తహీనత, క్షయ తదితర వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యాక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేవాదాయ మన్యం భూములను కాపాడండి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో దేవాదాయ మన్యం భూములను కాపాడాలని మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కోయిలకొండ గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు ఈశ్వరుని స్వామి భూములను అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సర్వేనెంబర్ 457 ఉన్న 15 ఎకరాల 40 సెంట్లు భూమి ఉన్నది అన్నారు. 2002లో దేవదాయ శాఖ నుంచి ఆరు ఎకరాలు భూమిని రూ.1.80 లక్షలకు విక్రయించి రెవెన్యూ శాఖకు ఇచ్చారన్నారు. ఆరు ఎకరాల భూమిలో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి బిల్డింగ్ నిర్మించింది మోడల్ కాలనీ ఏర్పాటు చేసిందన్నారు. మిగిలిన 9 ఎకరాల 40 చెట్ల గాను అందులో 2 ఎకరాలు భూమిలో వారి స్వలాభం కొరకు ప్లాట్లు వేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇలాంటి దుర్మార్గమైన చర్యను ఖండించి ఈశ్వని స్వామి మాన్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడెంపాడు శ్రీనాథ్ రెడ్డి కోయిలకొండ గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

శైలపుత్రి అలంకారంలో భ్రమరాంబ దేవి

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో దసరా నవరాత్రి మహోత్సవంలో భాగంగా మొదటి రోజైన సోమవారం నాడు శ్రీ భ్రమరాంబ దేవి శైలపుత్రి అలంకారంలో శివపార్వతులు బృంగి వాహన సేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఉభయ దేవాలయాల యాగశాలలో ప్రత్యేక పూజలు అనంతరం సాయంకాలం స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను అక్కమహాదేవి అలంకరణ మండపంలో, అమ్మవారి ఆలయ ముందు భాగంలో ప్రత్యేకంగా శైలపుత్రి అలంకారంలో అమ్మవారిని అలంకరింపజేయించి, స్వామి అమ్మ వాళ్ళ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ వాయిద్యాలు నడుమ వేదమంత్రోచ్ఛర్నుల నడుమ మరొకమారు మంగళ హారతులు ఇచ్చి, స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. సాయంకాల ప్రత్యేక పూజలు అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం శ్రీశైలం పురవీధుల్లో కోలాటాల నడుమ, మంగళ వాయిద్యాలు నడుమ, కళాకారుల విన్యాసాల నడుమ విద్యుత్ దీప కాంతులు నడుమ ఎంతో వైభవంగా ముందుకు సాగింది. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, అర్చక వేద పండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

పదే పదే తిప్పించుకోవద్దు : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: అర్జీ దారులను పది సార్లు తిప్పించుకోవద్దని, చేయగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంబంధం కాని సమస్యలు, చేయగలిగిన సమస్యల పరిష్కారంలో ఏ మాత్రం జాప్యం చేయకూడదని అధికారులను ఆదేశించారు. ఎంతో దూరం నుండి వస్తారని, ఓ రోజు కూలీ వదులుకుని వచ్చే వారు ఉంటారు కాబట్టి అధికారులు సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కువ కేసులు రీఓపెన్ అవుతున్నాయని, అర్జీ దారునితో వ్యక్తిగతంగా మాట్లాడితే సమస్య నాణ్యతగా పరిష్కారం అవుతుందన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన అర్జీలను వెంటనే ఓపెన్ చేసి చూడాలన్నారు. వసతి గృహాల బయట లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల తో బట్టలు ఉతికించకూడదని, వాషింగ్ మెషీన్‌లు ఏర్పా టు చేసుకోవాలని సూచించారు. భోజనం నాణ్యతతో లేదు అనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు అందుబాటులో వన్‌స్టాప్ సెంటర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు తక్షణ సహాయం అందించడానికి వన్‌స్టాప్ సెంటర్ అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వన్‌స్టాప్ సెంటర్, మిషన్ శక్తి ద్వారా గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలికలపై లైంగిక వేధింపులు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు వంటి సందర్భాల్లో బాధిత మహిళలకు చట్టపరమైన, వైద్య, మానసిక, సలహా, పునరావాస సహాయం అందజేయబడుతుందన్నారు. మహిళలు, బాలికలు తక్షణ సహాయం కోసం స్థానిక వన్ స్టాప్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. వన్ స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని, బాధిత మహిళలు మౌనంగా భరించకుండా ముందుకు వచ్చి సహాయం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.విజయ, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయ లక్ష్మి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ పి.మేరీ స్వర్ణలత, జోష్ణనా పాల్గొన్నారు.

మండల అధ్యక్షులుగా గవిగట్టు మల్లికార్జున

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల టీడీపీ కమిటీని టీడీపీ అధిష్టానం సోమవారం ప్రకటించింది. టీడీపీ మండల అధ్యక్షులుగా బసలదొడ్డి గ్రామానికి చెందిన గవిగట్టు మల్లికార్జున ఎంపికయ్యారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా మొత్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఉపాధ్యక్షులుగా నల్లమల విజయ్ కుమార్, మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా చిన్న కడబూరుకు చెందిన గోనుమాను నరసన్న, జాలవాడికి చెందిన ముక్కన్న, కంబదహాల్‌కు చెందిన మునెప్ప నియమితుల య్యారు. మండల కార్యదర్శులుగా ఉప్పర శాంతయ్య, కల్లుకుంట గ్రావమ సర్దార్ బాష, టీడీపీ మండల కార్యదర్శిగా చిన్నతుంబళం పూజారి ఈరన్న, మండల కోశాధికారిగా కొత్తూరు తిక్కయ్య ఎంపికయ్యారు. టీడీపీ మండల కమిటీ ఎంపికలో యువతకు పెద్దపీట వేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టీడీపీ బలోపేతానికి మండల నాయకుల సహాయ సహకారాలతో టీడీపీ నాయకులందరిని కలుపుకొని మండల కమిటీలోని సభ్యులందరూ ముఖ్య సైనికులుగా పని చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలావుండగా టీడీపీ మండల కమిటీ ఎంపికలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి వర్గానికి తీవ్ర నిరాశే ఎదురయింది. దీంతో రాబోయే రోజుల్లో టీడీపీలో ఎటువంటి రాజకీయ పరిణామాలు ఎదురవుతాయో వేచిచూద్దాం.